
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

గురువారం 20 మార్చి 2025

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
రాయచోటి	6.30	4.59
మదనపల్లె	6.32	5.05
రాజంపేట	6.28	5.07
పీలేరు	6.30	4.57

నేతన్నకు తీపి కబురు

చేనేతకు చేయూతనిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నేతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నాటి యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ చేనేతలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. యువగళంలో మదనపల్లె మండలం కొత్తవారిపల్లె వద్ద జరిగిన సమావేశంలో చేనేతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యువనేత దృష్టికి తెచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీని అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని ప్రకటించారు. ప్రకటన చేయడమే కాదు..ఇందుకు క్యాబినెట్ ఆమోదం తెలుపుతూ జీవో జారీ చేయడంతో చేనేతలు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- చేనేతలకు విద్యుత్ భరోసా..!!
- మాట నిలుపుకున్న నారా లోకేశ్
- చేనేత మగ్గాలకు 200 యూనిట్లు
- మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచితం
- జీవో జారీపై చేనేతల్లో ఆనందం



పట్టు చీరలు నేయడానికి సిద్ధం చేసిన దారాలు

మదనపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో చేనేతలు, చేనేత కార్మికులు ఉన్నారు. వీరిలో మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో ఎక్కువగా ఉన్నారు. తర్వాత తంబళ్లపల్లె, బి.కొత్తకోట, ములకలచెరువు, గాలివీడు, వీరబల్లి, మట్లి, సంబేపల్లె, తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. ఇలా జిల్లాలో మొత్తంగా తీసుకుంటే 20 వేలకుపైగా చేనేతలు, 10 వేలు పవర్ లూమ్స్ ఉన్నట్లు అంచనా. చేనేత రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పథకంపై ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేయగా, విధివిధానాలను రూపొందిస్తోంది. దీనిపై లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే, చేనేత, జౌళి శాఖాధికారులు, విద్యుత్ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టి లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు. తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు 50 శాతం మంది చేనేతలకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది లబ్ధిదారులు రాగా, పట్టణ ప్రాంతాల్లో వీరి సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. నీరుగట్టివారిపల్లె లాంటి ప్రాంతాల్లో నివాసాలు, మగ్గాల యూనిట్‌ను వేర్వేరుగా లెక్కిస్తున్నారు. అదే శివారు, గ్రామీణ ప్రాంతాలైన కోళ్లబైలు, బి.కె.పల్లె, చంద్రాకాలనీ, అనపగుట్ట, చేనేతనగర్, బాబుకాలనీ, వెంకటేశ్వరనగర్, తదితర ప్రాంతాల్లో నివాసాలను పెద్దగా పరిగణలోకి తీసుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి లబ్ధి చేకూరనుంది.

ఈ పథకంలో చేనేత, మరమగ్గాల సంఖ్యతో పాటు అవి పనిచేసే సమయాన్ని బట్టి కూడా స్లాబ్ మారే అవకాశం ఉంది. సగటున తీసుకుంటే పట్టణంలో నాలుగు చేనేత మగ్గాలు, రెండు పవర్‌లూమ్స్ వాడుకునే అవకాశం ఉందని చేనేతలు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు తీసుకుంటే కుటుంబానికి నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ కలిసొచ్చే అవకాశం కనిపిస్తోంది. కర్ణాటకలో మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వెయ్యి యూనిట్లకు వరకూ సీఎం సిద్దరామయ్య పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్తు అమలు చేస్తున్నారు. అదే అక్కడి కార్మికులకు కలిసొస్తోంది. ఇదే విధానాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలనే డిమాండ్ వినిపించింది. ఇదే విషయాన్ని లోకేశ్ పాదయాత్రలో చేనేత సంఘాలు, నాయకులు, కార్మికులు ప్రస్తావించారు. ఆ స్థాయిలో కాకపోయినా మీకు సంతృప్తికరమైన నిర్ణయమే తీసుకుంటామన్న హామీని లోకేశ్ నిలబెట్టుకున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

ఆర్థిక ఇబ్బందుల్లో కాస్త ఉపశమనమే



చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం ఇవ్వడం సంతోషమే. ఇది చేనేత కార్మికులకు తోడ్పాటు అవుతుంది. ప్రస్తుతం చేనేత రంగం సంక్షోభంలో ఉంది. కార్మికులు కూడా ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడడం సర్వసాధారణం అయిపోయింది. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం చేయూత ఇవ్వడం కాస్త ఉపశమనమే. కొంతలో కొంత ఆర్థిక భారం తగ్గుతుంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సబ్సిడీలు ఎత్తేయడంతో ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగాయి. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషం.

- ఎం.రామ్మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ చేనేత కార్మికసంఘం, మదనపల్లె.



చేనేత మగ్గం నేస్తున్న కార్మికురాలు

ప్రభుత్వ నిర్ణయం చేనేతకు వరం



చేనేతలకు చేయూతనిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆ వర్గాలకు వరం లాటింది. వైసీపీ ప్రభుత్వంలో ముందున్న అన్ని సంక్షేమ పథకాలు తొలగించి నేతన్ననేస్తం మాత్రం ఇవ్వడంతో చాలామంది కార్మికులు నష్టపోయారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు ఆనందంగా ఉంది. చేనేతల్లో రెండు మూడు, నాలుగు, పవర్‌లూమ్స్‌లో రెండు ఉన్నవారికి మేలే. మొత్తమ్మీద తీసుకుంటే ప్రతి ఒక్కరికీ ఉపశమనమే కలగనుంది.

- అడపా సురేంద్ర, జనసేన చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మదనపల్లె.

ఆంక్షలు ఉండకూడదు



నేతన్నలను ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత విద్యుత్ పథకం వరంలాంటిది. అయితే దానిని క్షేత్రస్థాయి అమలులో అధికారులు మంచి నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. లబ్ధిదారులను తగ్గించే క్రమంలో కఠినమైన ఆంక్షలు కాకుండా సరళంగా ఉండాలి. సాధారణంగా కార్మికుడు అక్కడే నివాసం ఉంటూ నివాసంగా, మగ్గానికి ఉపయోగిస్తుంటాడు. ఈ రెండింటినీ పరిగణలోకి తీసుకోవాలి. కూలి మగ్గాలనూ తీసుకోవాలి. గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అమలు చేస్తే మరీ మంచిది.

- జి.సుధాకర్, చేనేత సంఘం నాయకుడు, నీరుగట్టువారిపల్లె

ఆస్తిపన్నుపై కూడా నిర్ణయం తీసుకోవాలి



చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇవ్వడం చాలా మంచిది. సాధారణ, మధ్యతరగతి చేనేతలు, కూలీలు, కార్మికులకు లబ్ధి చేకూరుతుంది. ఇంత వరకు ఎవరూ చేయని, తీసుకోని నిర్ణయాన్ని తీసుకున్నారు. ఉచిత విద్యుత్ అనేది ఇప్పటి వరకు రైతులకు మాత్రమే ఉండేది. అది చేనేత వరకు తేవడాన్ని స్వాగతిస్తున్నా. కొన్నేళ్లుగా చేనేతలు చేస్తున్న డిమాండ్ కూడా ఇదే. దీంతో పాటు ఆస్తిపన్ను కూడా కమర్షియల్ నుంచి రెసిడెన్షియల్ కేటగిరీ కిందకు మార్పు చేయాలి.

- కె.ధనంజయ, చేనేత కార్మికుడు, నీరుగట్టువారిపల్లె.

26 నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు



బోయనపల్లె థీం పార్కులోని అన్నమాచార్యుల విగ్రహం

రాజంపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి 30 వేల సంకీర్తనలు పాడిన అన్నమాచార్యుల 523 వర్ధంతి వేడుకలు ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలను అన్నమాచార్యులు జన్మించిన తాళ్లపాకలో, బోయనపల్లెలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద థీంపార్కులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అధికారి హేమలత తెలిపారు. ఇందులో భాగంగా 26వ తేదీ ఉదయం 7 గంటలకు నగర సంకీర్తన, 9 గంటలకు సప్తగిరుల గోష్ఠిగానం, సాయంత్రం 6.30 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీత సభ, రాత్రి 8 గంటలకు హరికథ ఉంటాయి. 27, 28 తేదీల్లో అన్నమాచార్య ధ్యాన మందిరంలో పలు కార్యక్రమాలు, సాయంత్రం 6.30 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంగీత సభ, రాత్రి 8 గంటలకు హరికథ కాలక్షేపం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 29వ తేదీ రాత్రి 8 గంటలకు అన్నమాచార్య ధ్యానమందిరం ప్రాంగణంలో శ్రీరామ పాదుకలు నాటకం ఉంటుందన్నారు. వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాటుబాంబులతో వన్యప్రాణుల వేట

- నలుగురు బైండోవర్

పీలేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాటుబాంబులతో వన్యప్రాణులను వేటాడుతున్నారని నలుగురిని బైండోవర్ చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన కౌలు రైతు గుట్టమీద వెంకటేశ్వరరాజు గ్రామ పొలిమేరల్లో ఒక ఎకరా పొలాన్ని లీజుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నాడు. అడవి పందుల బెడద నుంచి తప్పించుకోవడానికి పొలం చుట్టూ నాటుబాంబులతో కూడిన విద్యుత్ కంచెను అతను ఏర్పాటు చేసుకున్నాడని, వాటి కారణంగా ఐదు రోజుల కిందట అతడి పొలం వద్ద అడవి పంది మృతి చెందినట్లు బుధవారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందింది.

దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంకటేశ్వరరాజు పొలాన్ని పరిశీలించారు. విద్యుత్ ఫెన్సింగ్ ఉండటం చూసిన పోలీసులు వెంకటేశ్వరరాజు, అతడి స్నేహితులైన వెంకటేశ్వరరాజు, జయచంద్రారెడ్డి, భాస్కరరెడ్డిలకు కౌన్సెలింగ్ ఇచ్చి తహసీల్దారు భీమేశ్వరరావు ఎదుట బైండోవర్ చేశారు. అనుమతులు లేకుండా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకోవడం, వన్యప్రాణుల ప్రాణాలకు హాని కలిగించడం వంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా

- అగ్రి డైరెక్టర్ డిల్లీరావు

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్టు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగాన్ని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

టమోటా ధరలు పతనం



పెద్దమండ్యం ప్రాంతంలో తోటల్లోనే వదిలేసిన టమోటాలు

పెద్దమండ్యం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి రాని స్థితి ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో టమోటా సాగు పెరగడంతో పాటు స్థానికంగా కూడా దిగుబడులు కూడా భారీగా వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఎగుమతులు లేకపోవడంతో ధర పడిపోయింది. బుధవారం ములకలచెరువు మార్కెట్‌లో 25 కిలోల క్రేట్ రూ.60 నుంచి రూ.190 మాత్రమే పలికిందని రైతులు తెలిపారు. మదనపల్లి మార్కెట్‌లో 'ఏ' గ్రేడ్ 25 కిలోల టమోటా రూ.550 పలికిందని రైతులు తెలిపారు. దీంతో కూలి చెల్లించడానికి కూడా డబ్బు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చినా, ధర పతనం కావడంతో రైతులు పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు. ఎకరాకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు కష్టపడినా గిట్టుబాటు ధరలేక పోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆదుకోవాలని టమోటా రైతులు కోరారు.

పది పరీక్ష రాస్తూ అస్వస్థత

- 108లో మదనపల్లెకు తరలింపు



స్ట్రెచర్‌లో రజితను తీసుకొస్తున్న వైద్య సిబ్బంది

గుర్రంకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థిని రజితకు ఫిట్స్ కనపడడంతో అస్వస్థతకు గురైన సంఘటన గుర్రంకొండ ఉర్దూ హైస్కూల్‌లో జరిగింది. ఎంఈవో సురేంద్రబాబు వివరాల మేరకు...

మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన రామచంద్ర కుమార్తె రజిత చెర్లోపల్లె జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. బుధవారం గుర్రంకొండ ఉర్దూ హైస్కూల్‌లో పరీక్ష రాయడానికి వచ్చింది. పరీక్ష ప్రారంభమైన గంట తరువాత విద్యార్థినికి ఫిట్స్ రావడంతో గమనించిన ఇన్విజిలేటర్ అధికారులకు తెలపడంతో డాక్టర్‌ను పిలిపించి వైద్యం చేయించారు. అయితే అరగంట తరువాత మరోసారి ఫిట్స్ రావడంతో విద్యార్థిని ఆపస్మారక స్థితిలోకి చేరుకుంది. దీంతో విద్యార్థినిని వెంటనే 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎంఈవో సురేంద్రబాబు తెలిపారు.

పీలేరులో పేలనున్న ఐపీ బాంబు?

- బేకరీ యజమాని అదృశ్యం కావడంతో పుకార్లు
- పోలీసులను ఆశ్రయించిన పలువురు బాధితులు



పీలేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో త్వరలో ఓ బేకరీ యజమాని ఐపీ పెట్టనున్నట్లు బుధవారం స్థానికంగా పెద్దఎత్తున పుకార్లు వ్యాపించాయి. 33 ఏళ్లుగా తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి పీలేరులో బేకరీ నడుపుతున్నాడు. చిన్నతనం నుంచి ఇక్కడే ఉండడంతో అతను స్థానికుల్లో బాగా కలిసిపోయాడు. అతడి తండ్రి హయాం నుంచి బేకరీ వ్యాపారం ఉండడంతో స్థానికులు అతనికి పెద్దఎత్తున అప్పులు ఇచ్చారు. అయితే ఇటీవల వ్యాపారంలో నష్టాలు రావడంతో అతను అధిక వడ్డీలకు దాదాపు రూ.3 కోట్ల మేర అప్పులు చేసినట్లు సమాచారం. బేకరీ బుధవారం మూతపడడం, అప్పు తీసుకున్న సమయంలో రుణదాతలకు ఇచ్చిన సెక్యూరిటీ చెక్కుల విషయంలో పలువురికి నోటీసులు రావడంతో ఈ విషయం బయటకు పొక్కింది. తన చెక్కులు చోరీకి గురయ్యాయని, తన చెక్కులు ఇతరుల వద్ద ఉంటే అవి చెల్లవని అతను నోటీసులు పంపడంతో తాము మోసపోయామని చాలామంది రుణదాతలు గ్రహించారు. అతనికి ఎంత మంది అప్పులు ఇచ్చారో, ఎంత మొత్తంలో అతను అప్పులు చేశాడో తెలియాల్సి ఉంది. ఐపీ దాఖలు చేసే ఆలోచనతోనే అతను చెక్కుల గురించి నోటీసులు ఇచ్చాడని, త్వరలోనే రుణదాతలు అందరికీ ఐపీ నోటీసులు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఈ విషయంపై పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ మాట్లాడుతూ కొంతమందికి లీగల్ నోటీసులు వచ్చిన మాట వాస్తవమేనని, వాటిని తీసుకుని కొంతమంది తమను సంప్రదించారని, అయితే లీగల్ నోటీసులకు కోర్టు ద్వారానే సమాధానం ఇవ్వాలని చెప్పామని వివరించారు. బాధితులు స్పష్టమైన ఆధారాలతో సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రీసర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్



రీసర్వే వివరాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ శ్రీధర్

గాలివీడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం గాలివీడు మండలం వందికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని బత్తినవాండ్లపల్లెలో సర్వే నెంబర్-106లో రైతులు బి.ఇరగంరెడ్డి, బి.వెంకట్రమణారెడ్డికి చెందిన 75 సెంట్ల భూమిలో జరుగుతున్న రీసర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయి, ఎన్ని టీములు సర్వే చేస్తున్నాయి, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో రీసర్వే చేశారు తదితర వివరాలను తహసీల్దార్ భాగ్యలతను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే ప్రక్రియలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములు తదితరాలను పక్కాగా సర్వే చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడి వారికున్న విస్తీర్ణం, సర్వే చేసిన కొలతలు సరిపోతున్నాయా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముందు బందోబస్తు



ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఇంటి ముందు పహారా కాస్తున్న పోలీసులు

ఓబులవారిపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు మంత్రి మండలి ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ దళిత ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమానికి కొన్ని దళిత సంఘాలు పిలుపునివ్వడంతో పోలీసులు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. దళిత సంఘాలకు చెందిన రాష్ట్ర స్థాయి నాయకుల పిలుపు మేరకు స్థానిక నాయకులు నిరసన తెలియజేసేందుకు ఎమ్మెల్యే ఇంటి వద్దకు వస్తారని ముందస్తు సమాచారం అందడంతో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సొంత గ్రామమైన ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీ గొల్లపల్లె దళితవాడలోని ఆయన ఇంటివద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. రైల్వేకోడూరులో ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేశ్ తెలిపారు. అయితే గురువారం రైల్వేకోడూరులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నియోజకవర్గ వ్యాప్తంగా దళిత సంఘాలతో కలిసి నిరసన తెలిపేందుకు పిలుపునిచ్చినట్లు సమతా సైనిక్‌దళ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు చౌడవరం సుబ్బనరసయ్య తెలిపారు.

ఉపాధి హామీలో భారీగా బదిలీలు



బదిలీల కౌన్సెలింగ్ చేస్తున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీలో పనిచేస్తున్న ఏపీడీ ఏపీవోల్లో బదిలీలు చేస్తూ బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఎటువంటి అక్రమాలకు చోటు ఇవ్వకుండా పారదర్శకంగా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేసి బదిలీలు చేపట్టినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. ఇందులో మొత్తం 146 మందిని బదిలీ చేశామని వారు తెలిపారు. ఈసీలు 13, పీఎఫ్‌టీ 13 మంది, సీవోలు 42 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 53 మంది, టీఎఫ్‌టీ 17 మంది, మరికొంత మందిని బదిలీ చేస్తూ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు.

కాలగర్భంలోకి.. కాలజ్ఞానం!

- నగరిపాడు రంగనాయక ఆలయంలో ప్రతులు
- శిథిలమవుతున్న తాళపత్ర గ్రంథాలు
- ఏడాదికోసారి ప్రదర్శన
- చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతి

మహనీయుడొక్కడు పుట్టేనయా...
మత భేదములు లేకుండ చేసేనయా...
చెడ్డవాని చేతిలో సచ్చేనయా...
సిద్ధ శివ గోవిందా గోవిందా..
హరి గోవిందా గోవిందా...
రమణీ యొక్కటి పుట్టు..
రాజ్యమును పాలించు...
పేదలను ఎక్కించు..
రాజులను దింపించు...
ఆకాశమునందు రక్తమై కనిపించు...
సిద్ధ శివ గోవిందా గోవిందా..
హరిగోవింద.. గోవిందా... అంటూ 17వ శతాబ్దంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞాన ప్రతులు చిట్వేలి మండలం నగరిపాడు గ్రామంలోని శ్రీ రంగనాయస్వామి ఆలయంలో ఉన్నాయి.




అగ్నిగుండంలో లభించిన దండం, కాలజ్ఞానం గ్రంథం, శిథిలమైపోతున్న కాలజ్ఞాన గ్రంథంలోని తాళపత్రాలు

రాంజపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రజలనే మేలుకొల్పిన బ్రహ్మంగారి కాలజ్ఞాన ప్రతులకు రక్షణ కరవైంది. ఈ గ్రంథ ప్రతులు కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంతోపాటు సిద్దయ్య మఠం, నంద్యాల జిల్లా బనగానపల్లెలోని గరిమిరెడ్డి అచ్చమ్మ ఆలయంలో, అన్నమయ్య జిల్లా నగరిపాడు రంగనాయక ఆలయంలోను ఉన్నాయి. ఈ ఆలయంలో ఉన్న ప్రతులకు ఎటువంటి రక్షణా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని ఆలయ కమిటీ ఓ పెట్టెలో భద్రపరిచి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రదర్శిస్తోంది.

కుల రహిత సమాజం కోసం..

వీరబ్రహ్మేంద్రస్వాము లవారు రచించిన కాలజ్ఞాన ప్రతులు నగరిపాడు రంగనాయక ఆలయానికి ఎందుకు చేరాయన డానికి స్థానికంగా ఓ కథ ప్రచారం లో ఉంది. 17వ శతాబ్దంలో చిట్వేలి మండలం నగరిపాడుకు చెందిన జగ్గరాజు, జగ్గమ్మ దంపతులకు బ్రహ్మంగారి వరప్రసాదంగా శ్రీ రంగనాయకస్వామి జన్మించారు. చిన్నతనంలోనే రంగరాజు దేశాటన చేస్తూ బ్రహ్మంగారి ఆలయానికి చేరాడు. అక్కడ బ్రహ్మంగారి మనవరాలు ఈశ్వరమ్మ పట్ల ఆకర్షితుడయ్యాడు. అయితే, కులాంతర వివాహాన్ని ఈశ్వరమ్మ తండ్రి గోవిందయ్య, పిన తండ్రి పోతులూరయ్య వ్యతిరేకించారు. తాను బ్రహ్మంగారి వరపుత్రుడినని, తన మనుమరాలైన ఈశ్వరమ్మను పెళ్లి చేసుకోవాలని ఆయన ఆజ్ఞాపించారని, లేదంటే జీవ సమాధి అవుతానని చెప్పారట. అక్కడి పెద్దలు, బ్రహ్మంగారి కు మారులు దీనిపై ఆలోచించి బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞాన ప్రతులను పరిశీలించి అందులో ఈ ప్రస్తావన ఉంటే వివాహం చేస్తామని చెప్పారట. దీంతో బనగానపల్లెకు వెళ్లి గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంటి ముంగిట చింతచెట్టు వద్ద భూమిలో దాచి ఉంచిన కాలజ్ఞాన ప్రతుల్లో మూడింటిని వెలికితీసి వాటితో కందిమల్లాయపల్లెకు వచ్చాడట. ఆ ప్రతులను పరిశీలించగా ఈ జన్మలో శ్రీ రంగరాజుకు, ఈశ్వరమ్మకు పెళ్లి యోగం లేదని, కులాంతర వ్యవస్థ నశించే వరకు ఈ పెళ్లి జరగదని రాసి ఉందట. అంతవరకు శ్రీరంగరాజు, ఈశ్వరమ్మ జీవ సమాధి కావాలని, కుల రహిత సమాజం ఏర్పడిన తర్వాత పునర్జన్మించి వివాహమాడుతారని అందులో ఉందట. ఆ ప్రకారం ఈశ్వరమ్మ బ్రహ్మంగారి జీవ సమాధి పక్కనే సజీవ సమాధి కాగా, రంగరాజు నగరిపాడులోని తన స్వగ్రామంలో అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేశాడని చెబుతుంటారు. అగ్నిగుండం ఆరిపోయిన తర్వాత ఆ బూడిదలో బయటపడిన పాదుకలు, యోగదండం, శిఖాముద్రికలు బయటకు తీసి పూజలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రంగనాయక ఆలయం నిర్మించారు. ఆయన ఆనాడు తీసుకువచ్చిన మూడు ప్రతుల్లో 2 కందిమల్లాయపల్లెలో ఉంచి ఒక ప్రతిని నగిరిపాడులోని రంగనాయకుల ఆలయంలో భద్రపరిచారు. రంగరాజు 1692లో జన్మించగా ఫిబ్రవరి 21, 1717లో జీవ సమాధి అయ్యారు.



నగరిపాడు ఆలయంలోని రంగనాయకస్వామి మూలవిరాట్

కాలజ్ఞాన ప్రతులను ప్రచురించాలి



కాలజ్ఞాన ప్రతులకు తగిన భద్రత లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలజ్ఞాన ప్రతులతో పాటు రంగరాజు పాదుకలు, యోగదండం, శిఖా ముద్రికలకు అధికారులు రక్షణ కల్పించాలి. ఈ కాలజ్ఞాన ప్రతులను ముద్రించాలి.

- పోలిన నాగేశ్వర నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్, నగిరిపాడు

కాలజ్ఞాన ప్రతులకే దిక్కులేకపోతే ఎలా ?



భూత భవిష్యత్ వర్తమానాలకు సంబంధించిన కాలజ్ఞాన ప్రతులను ఇంత వరకు అధికారులు కాని, జిల్లా అధికార యంత్రాంగం కాని పరిశీలించలేదు. దీంతో ఈ గ్రంథంలోని తాళపత్రాలు రోజు రోజుకు శిథిలమైపోతున్నాయి.

- పాటూరు సుబ్బరామిరెడ్డి, నగిరిపాడు గ్రామం, చిట్వేలి

పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పూర్తయిన పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఇస్తున్న అదనపు ఆర్థిక సాయం లబ్ధి దారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ సిబ్బంది తదితరులతో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు, రీసర్వే, ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్, పల్లె పండుగ కార్యక్రమాలు, ఎన్టీఆర్ హౌసింగ్, పీ4 సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 17 రకాల అంశాలను ఆధారంగా చేసుకొని అనర్హులను తీసివేయాలన్నారు. అర్హులకు మాత్రమే ఇళ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పల్లె పండుగ కింద దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయని ఎంపీడీవోలు అందరూ మంచి పురోగతి సాధించారని అభినందించారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో పూర్తయిన పల్లెపండుగ నిర్మాణాలను ఉగాది రోజున ప్రారంభించాలని సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింది ఎస్సీ ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకొని, ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మతో కలిసి మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ ఆనర్స్) మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈకోర్సులో ప్రవేశానికి ఇంటర్, సమాన అర్హతగల వారు ప్రవేశానికి అర్హులన్నారు. ఇతర వివ రాలకు హెచ్‌టీటీపీఎస్:// సీడీఓఈ. వైవీయూ.ఈడీయు.ఐఎన్‌ను సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

- ఫ్యాక్షన్‌జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి



మాట్లాడుతున్న సీఐ రమణారెడ్డి, హాజరైన విద్యార్థులు

కడప క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీకేదిన్నె పీఎస్ పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రుల కలలను కల్లలు చేస్తున్నారన్నారు. మత్తు పదార్థాలకు బానసలైతే విచక్షణాశక్తిని కోల్పోయి.. ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సీకేదిన్నె సీఐ శంకరనాయక్ మాట్లాడుతూ కళాశాల సమీప ప్రాంతాల్లో కానీ, చుట్టుపక్కల కానీ ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఓడీ శశికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను విరమించుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నేతలు

జమ్మలమడుగు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే విరమించుకోవాలని రాష్ట్ర మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, కూటమి ప్రభుత్వం దళితుల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అర్బన్ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి సీఐ గోపాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది నిరసన చేస్తున్న వారిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు కమిటీ ప్రణయ్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపకులపతి విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కళాశాల వార్షికోత్సవం, వ్యవస్థాపక దినోత్సం సందర్భంగా బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాపోటీలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్, కులసచివులు ఎన్.రాజేష్ కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆచార్య జి.విశ్వనాథ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఉత్సాహపూరితమైన వాతావరణంలో వర్సిటీలోని అన్ని విభాగాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన కబడ్డీ పోటీలలో ఆర్కిటెక్చర్ విభాగపు విద్యార్థులపై స్కాల్ప్చర్ విభాగం విద్యార్థులు విజయం సాధించారు. అలాగే క్రికెట్ పోటీలలో అప్లైడ్ ఆర్ట్ విభాగంపై ఆర్కిటెక్చర్ విద్యార్థులు విజయం సాధించారు. గెలుపొందిన జట్లను వర్సిటీ ఉన్నతాధికారులు అభినందించారు.

హత్యాయత్నం కేసులో వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అరెస్టు

సీకేదిన్నె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో కమలాపురం వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గోవిందు విజేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లె గ్రామంలో బావి వద్ద చెట్లు కొట్టుకునే విషయమై గజ్జల మల్లికార్జునరెడ్డి, చెన్నూరు నాగమల్లారెడ్డి కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో నాగమల్లారెడ్డి బంధువైన కమలాపురం మండలం పాచికలపాడు గ్రామానికి చెందిన విజేందర్‌రెడ్డి తన ఐదుగురు అనుచరులతో 2024 జనవరి 29న మల్లి కార్జునరెడ్డిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో నాగమల్లారెడ్డి, అతని భార్య రాజమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ అండదండలతో విజేందర్‌రెడ్డిని కేసు నుంచి తప్పించారు. అయితే ప్రస్తుతం అతనిపై మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పోలీసు స్టేషన్‌కు వచ్చి విజేందర్‌రెడ్డిని పరామర్శించారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- ఐదుగురు మహిళలకు గాయాలు



పోలీసుల అదుపులో ఉన్న యువకుడు

బద్వేలుటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేసి మహిళలను గాయపరిచిన ఘటన బద్వేలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని ఎగువ బ్రాహ్మణవీధికి చెందిన చరణ్ అనే యువకుడు బుధవారం రాత్రి మద్యం సేవించి ఎగువ బ్రాహ్మణవీధి నుంచి నాగులకట్ట చెరువువైపు ద్విచక్రవాహనం వేగంగా వెళుతుండగా.. అక్కడే ఉన్న మహిళలు నెమ్మదిగా వెళ్లమన్నారు. దీంతో ఆ యువకుడు ఆగ్రహానికిలోనై మహిళలను బూతులు తిడుతూ వారి కాళ్లను చేతులను విచక్షణారహితంగా కొరికాడు. దీంతో రమణమ్మ, కుమారి, శ్రావణితో పాటు మరో ఇద్దరికి గాయాలు కాగా.. పోలీసులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు యువకుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సచివాలయ ఏఎన్‌యం మృతి

పెండ్లిమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచునూరు సచివాలయ ఏఎన్ఎంగా పనిచేస్తున్న జ్యోతి (30) గత కొద్ది రోజు లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండేది. ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సచివాలయ, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది నివాళులు అర్పించారు.

ఒంటిమిట్టను టూరిజం హబ్‌గా చేయడం శుభపరిణామం

టీడీపీ సీనియర్ నేత మోదుగుల పెంచలయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు మోదుగుల పెంచలయ్య, కొమరా వెంకటనరసయ్య

రాజంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టను ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు టూరిజం హబ్‌గా చేయడం శుభ పరిణామమని టీడీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్యలు పేర్కొన్నారు. బుధవారం ఒంటిమిట్టలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడుతూ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశం ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రసాద ప్రోగ్రాం కింద ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని తెలపడం ఆనందదాయకమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.వంద కోట్లతో ఒంటిమిట్ట అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేశారన్నారు. అయితే గత జగన్ ప్రభుత్వంలో నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి.. చెరువుకు నీరందించి బోటు షికారుతో పాటు ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామనడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు వెంకటరమణ, మోదుగుల నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

కమలాపురం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పని కావాలని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికా రులపై ఉందని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గోపులాపురం సమీపంలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న ఫారం పండ్ పనిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తమ పొలంలో ఫారం పాండ్ పనులు చేసుకోవడం వల్ల వర్షపు నీటిని భూమిలోకి రీచార్జ్ చేయవచ్చన్నారు. అత్యవసర సమయంలో ఆ నీటిని ఉపయోగించుకోవచ్చన్నారు. అనంతరం రైతులు నాటుకున్న చీనీ మొక్కలను పరిశీలించారు. గోపులాపురం వెళ్లేదారిలో ఉపాధి పథకం కింద కాల్వ పనిని పరిశీలించి.. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఎంపీడీవో జ్యోతి, ఏపీవో పార్థసారధి, జేఈ ఉపేంద్రారెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

సింహాద్రిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు అదనపులోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ దినేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒక కిలో వాట్‌కు డెవలప్మెంట్ చార్జీలు మునుపు రూ.2000లు కాగా ప్రస్తుతం 50 శాతం రాయితీతో రూ.1000లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఏపీ ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో గానీ, విద్యుత్ ఉప కేంద్రం లోని అధికారులను కలసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాగా సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎలాంటి మార్పు వుండద న్నారు. కిలో వాట్‌కు రూ.200లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పట్టపగలు ఏటీఎంలో చోరీకి యత్నం... ఇద్దరు అరెస్టు



ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగలతో సీఐ, పోలీసులు

ఎర్రగుంట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో పట్టపగలు చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం సాయంత్రం సీఐ నరేష్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజుపాలెం మండలంలోని తొండలదిన్నెకు చెందిన కొత్తమాసి సుధీకర్ 2020 నుంచి సెక్యూర్ వ్యాల్యూ కంపెనీలో ఏటీఎంలలో డబ్బులు లోడ్ చేసే ఉద్యోగం చేసేవాడు. చెడు వెసనాలకులోనైన సుధీకర్ అప్పుడప్పుడు నగదును చోరీ చేస్తూ సుమారు రూ.36లక్షల వరకు చోరీ చేశాడు. దొంగిలించిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ వారు దొంగిలించిన డబ్బులను రికవరీ చేసి.. అతనిని విధుల నుంచి తొలగించారు. దీంతో అప్పులు కావడంతోపాటు తిరిగి అప్పులు పుట్టకపోవడంతో ఎలాగైనా డబ్బులు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులో మూసివేసిన ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎంలో చోరీ చేసేందుకు నిర్ణయించుకున్నాడు. గతంలో ఏటీఎంలో డబ్బులు పెట్టేవాడు కాబట్టి ఎవరికి అనుమానం రాదనుకున్నాడు. తనకు స్నేహితుడు, వెల్డింగ్ పనిచేసే తొండలదిన్నెకు చెందిన గాలిపోతుల అభిషేకంతో తన పథకం చెప్పాడు. ఇద్దరూ కలిసి నంద్యాలకు వెళ్లి గ్యాస్ సిలిండర్, కట్టర్‌ను కారులో తీసుకువచ్చి 17వ తేదీ మధ్యాహ్నం 1.50గంటలకు మూసివున్న ఏటీఎం షెట్టర్ తీసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేశాడు. అయితే డబ్బు ఉన్న బాక్స్ ఎంత ప్రయత్నించినా తెరచుకోలేదు. అప్పటికే చాలా సేపు కావడంతో ఎవరైనా వస్తారేమోనని భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈవిషయం తెలుసుకున్న ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఎర్రగుంట్ల వై.జంక్షన్ వద్ద ఇద్దరిని అరెస్టు చేసి.. కారు, ఆక్సిజన్ సిలిండర్, గ్యాస్ కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు గురుశంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ తల్లికి పూజలు



సుండుపల్లె, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ మిట్టబిడికిలో వెలసిన మారెమ్మ తల్లి, కాళికాదేవిల 6వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అభిషేకం, పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయాన్ని అలంకరించి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులు ప్రసాద వితరణ చేశారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ రాయచోటి డివిజన్ కార్యాలయం ఆవరణలో ఈనెల 21వ తేదీ నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు తమ సమస్యలను ప్రత్యేక అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు.

నాగిరెడ్డిపల్లె సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం

నందలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లె సచివాలయం-1లో ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్ రేణుకాస్వర్ణ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ వరకు ఆధార్ నమోదు కేంద్రం ఉంటుందని, 0 నుంచి 5సంవత్సరాల వారికి ఆధార్ అప్‌డేట్, ఫొటో మార్పు, ఫోన్ నంబరు లింక్ తదితర వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

మామిడిలో సస్యరక్షణ అవసరం

● ఉద్యానశాఖ జిల్లా అధికారి రవిచంద్ర

రైల్వేకోడూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మామిడిలో సస్యరక్షణ అవసరమని ఉద్యానశాఖ జిల్లా అధికారి పి.రవిచంద్ర తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు ఉద్యాన పరిశోధనాస్థానంలో మామిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్రూట్స్ కవర్ల వినియోగం, మార్కెటింగ్‌పై రైతులకు వివరించారు. ఈ కవర్లు రూ.2.20 ధర ఉందని, రైతులకు రూ.1.20లతో సబ్సిడీకి అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన పరిశోధనాస్థానం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ కేఎం యువరాజు మాట్లాడుతూ మామిడిలో అధిక దిగుబడులు పొందడానికి సమగ్ర పోషక, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ఉద్యాన కళాశాల కీటక విభాగం శాస్త్రవేత్త మామిడిలో తేనెమంచు పురుగు నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. వేపనూనె, అజాడిరెక్టిన్, జిగురు మందును కలపి పిచికారి చేస్తే తేనెమంచు పురుగు చనిపోతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింతటిక్‌పైరిత్రోయిడ్స్ మందులను మామిడిలో వాడకూడదని తెలిపారు. పండు ఈగ నివారణకు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త జి.సందీప్‌నాయక్ మాట్లాడుతూ మామిడిలో బూడిద తెగులు, పక్షి కన్ను ఇతర తెగుళ్ల ఆశిస్తాయన్నారు. నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో కోడూరు, రాజంపేట ఉద్యాన అధికారులు యం.వెంటకభాస్కర్, జి.సురేష్‌బాబు, కోడూరు వ్యవసాయ శాఖ అధికారి జి.సుధాకర్, రైతుసేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన జిల్లా అధికారి రవిచంద్ర

వైభవంగా రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు



రథంపై ఊరేగుతున్న రంగనాయకస్వామి

రాజంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా చిట్వేలి మండలంలోని నగిరిపాడు రంగనాయకస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రివేళల్లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా రంగనాయకస్వామి రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్‌వో ప్లాంటు మోటార్లు, స్టార్టర్ అపహరణ

చిన్నమండెం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మల్లూరు కస్పా క్రాస్‌రోడ్డులో ఆర్‌వో ప్లాంటులోని మోటార్లు, స్టార్టర్ అపహరణకు గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ మద్దిరేవుల మేఘనారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 2021లో మల్లూరు కస్పా క్రాస్‌రోడ్డు వద్ద ఉచిత ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు గ్రామ ప్రజలకు ఉచితంగా నీటిని అందించారు. తరువాత స్థానికంగా కొన్ని పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్లాంట్‌ను మూసివేశారు. కాగా ఈ ప్లాంటును తిరిగి ప్రారంభించాలని సంకల్పించి బుధవారం ఉదయం డోర్ ఓపెన్ చేయగా అందులోని రెండు మోటార్లు, ఒక స్టార్టర్ అపహరణకు గురైనట్లు నిర్వాహకులు తెలిపారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన

పుల్లంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ మనోజ్‌చంద్ర బుధవారం దొండ్లోపల్లె గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అవసరమైతేనే బయటకు రావాలని, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని, సులువుగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను ఎక్కువగా వినియోగంచాలన్నారు. ముఖ్యంగా పిల్లలను ఎండ ఉన్నప్పుడు బయట తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీవీ రమణ



రాయచోటిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జీవీ రమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శంకరయ్య పదవీవిరమణ చేయడంతో ఆయన స్థానంలో అదే కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా ఉన్న జీవీ రమణకు ఎఫ్ఏసీగా నియమిస్తూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమణను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

శిశు గృహానికి మూడు రోజుల చిన్నారి



రాయచోటిటౌన్, మార్చి19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో కేటీసీ కల్యాణ మండపానికి ఎదురుగా ఉన్న ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశు గృహానికి బుధవారం మూడు రోజుల చిన్నారి చేరింది. మొలకలచెరువు మండలం ఉమాశంకర్‌కాలనీ ఆదర్శపాఠశాల వెనుకభాగంలో ఉన్న గుట్టల్లో మూడు రోజుల పసికందును బ్యాగులో పెట్టి వెళ్లిపోయారు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని చిన్నారిని శిశు గృహానికి తరలించారు. అయితే చిన్నారిని ఎవరైనా అపహరించి వదిలారా లేక పోషించలేక గుట్టు చప్పుడు కాకుండా ఇక్కడ వదిలివెళ్లారా అనేది తెలియాల్సి ఉంది. చిన్నారికి సంబంధించినవారు నెల రోజుల్లో వచ్చి పాపను గుర్తించి తీసుకెళ్లవచ్చునని ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు.

మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ చలపతి



మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు : సీఐ

రాయచోటిటౌన్, మార్చి19(ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై అనవసరంగా తిరుగుతున్న మైనర్లను వాహనాలతో సహా స్టేషన్‌కి తీసుకునివచ్చి వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. మైనర్లు లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడపడం నేరమని కౌన్సెలింగ్ ఇచ్చి ద్విచక్రవాహనాలను రవాణాశాఖ అధికారులకు అప్పగించారు.

ఉపాధి కూలి అందక ఇబ్బందులు

సిద్దవటం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా తమ అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదని బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని టక్కోలి గ్రామం ఎర్రచెరువులో ఫిష్‌పాండు పనులు చేపడుతున్నామని, చేసిన పనికి డబ్బులు జమ కాక కుటుంబ పోషణ భారమైందని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఈ విషయమై ఏపీవో నరసింహులును వివరణ కోరగా నిధులు త్వరలో మంజూరవుతాయని, వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు.

మూడో విడత 'ఆదరణ'పై సమీక్ష

పెనగలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టనున్న మూడో విడత ఆదరణ పథకంపై బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.విజయరావు కులసంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరికి ఏవిధమైన పనిముట్లు అవసరమో కుల సంఘాల ప్రజల నుంచి సూచనలు, సలహాలు, వినతులను స్వీకరించి ప్రభుత్వానికి తెలియజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పాత పెన్షన్‌ను అమలు చేయాలి

నందలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేకార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ స్థానిక సెక్రటరీ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైల్వే కేంద్రంలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రొటెక్ట్ వీక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు రాజీలేని పోరాటం చేయాలన్నారు. ముందుగా రైల్వే కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ పెంచలయ్య, వైస్ చైర్మన్ సురేష్‌బాబు, రాజేశ్వరయ్య, రామక్రిష్ణ, నరేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

అధికారులంతా హాజరు కావాలి

● ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి



సిద్దవటం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది ప్రతిఒక్కరు మీటింగ్‌కు హాజరయ్యేటట్లు చూడాలని ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఆసుపత్రి డెవలప్‌మెంట్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న డైట్ మీల్స్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని, కాంట్రాక్టుకు నూతనంగా టెండర్లు పిలిచేందుకు ఏర్పాటు చేయాలన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఓబులవారిపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ముక్కావారిపల్లెలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మూడు రోజుల పాటు పోషణబీ-పడాయిబీ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని సూపర్‌వైజర్ అనసూయ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లల అభివృద్ధిశాఖకు సంబంధించి విద్య, శిక్షణ కార్యక్రమాలను రాష్ట్రస్థాయి ట్రైనర్లు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● ఖాళీ బిందెలతో మహిళల నిరసన



సిద్దవటం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 15 రోజులుగా మంచినీళ్లు రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని మాధవరం-1 గ్రామం మహబూబ్‌నగర్‌లో నీటికొరత ఇబ్బందులు తప్పడంలేదని మహిళలు వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని, సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్‌ను వివరణ కోరగా మహబూబ్‌నగర్‌లో నీటికొరత ఉన్నది వాస్తవమేనని, సిద్దవటం, పెన్నానది వద్ద మాధవరం గ్రామానికి వెళ్లే మంచినీటి మోటారు రిపేరులో ఉందని, సమస్య పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నేత డాక్టర్ వీరభద్రుడు, హరి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు



ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు జీతాలు అందించాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో 2023 జూన్ నుండి 2024 జూన్ వరకు 12 నెలలు, ప్రస్తుత ప్రభుత్వంలో మూడు నెలలు మొత్తం 15 నెలల వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌వో మధుసూదన్ రావుకు ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు రాక కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 15 నెలలుగా జీతాలు ఇవ్వకుండా మభ్యపెడుతున్నారని, ఇప్పటికైనా వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

చిన్నమండెం, మార్చి19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడటం వల్ల ఆరోగ్యంగా ఉంటామని మార్కెటింగ్ మాస్టర్ ట్రైన్ పద్మావతి తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాల్యూచైన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు పండించిన తాజా కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యం వంటి ఉత్పత్తులు ఆరోగ్యకరమైనవని, స్టాల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాణ్యమైన పొడులు, మంచి ప్యాకింగ్ చేసి వినియోగదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపు వారపు సంత వేలంపాట

గాలివీడు, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కూరగాయల సంత, పశువుల సంత, బస్టాండు రుసుముల వేలంపాట ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్, సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ తెలిపారు. డీపీఎల్‌వో, ఈవోపీఆర్‌డీల ఆధ్వర్యంలో గాలివీడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాల్గొనదలచినవారు పశువుల సంతకు రూ.2 లక్షలు, కూరగాయల సంతకు రూ.1.50లక్షలు, బస్టాండ్‌కు రూ.లక్ష ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. అంతేగాక పాటదారులు తహసీల్దార్ ద్వారా రూ.3లక్షల ఆస్తి ధృవీకరణ పత్రం వేలంపాట సమయంలో సమర్పించాలన్నారు.

నేడు పశువుల సంత వేలం

రామాపురం, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువుల సంత, బస్టాండు గేటు వేలంపాట గురువారం సాయంత్రం 3 గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచినవారు పశువుల సంతకు రూ.50వేలు, బస్టాండు గేటుకు రూ.30వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. అలాగే పశువుల సంతకు రూ.2.50 లక్షలు, బస్టాండు గేటుకు రూ.50 వేల సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. పాటదారుడు స్టాండు డ్యూటీ చట్టం ప్రకారం 5 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించి అగ్రిమెంట్ చేసుకోవాలని తెలిపారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

నందలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలీ సూచించారు. బుధవారం నందలూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లు, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, తాగునీటి సమస్యలపై తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

రాజంపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోయనపల్లెలో విద్యార్థినుల వసతి గృహాలు నిర్వహించే యాజమాన్యం తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మన్నూరు సీఐ కుళాయప్ప సూచించారు. బుధవారం ఆయన ప్రైవేటు హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తియాప్‌ను ప్రతి విద్యార్థిని తన మొబైల్‌లో పొందుపరుచుకోవాలన్నారు. వసతి గృహాల యాజమాన్యం సీసీ కెమెరాల పనితీరుపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. విద్యార్థినుల రాకపోకల సమయాన్ని ప్రత్యేక రిజిస్టర్‌లో పొందుపరచాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు ముందస్తుగా పోలీసులకు సమాచారాన్ని అందించాలని ఆయన హాస్టల్ యజమానికి సూచించారు.



హాస్టల్ యజమానికి సూచనలు ఇస్తున్న సీఐ కుళాయప్ప



ఘనంగా మంత్రి మండిపల్లి సోదరుల జన్మదిన వేడుకలు

రాయచోటిటౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి (కవలలు)ల జన్మదిన వేడుకలు బుధవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు మండిపల్లి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వీరభద్రస్వామి ఆలయంలో, ప్రభుత్వ పాఠశాలలో గాజుల ఖాదర్‌బాషా అన్నదానం చేశారు.

రక్తదాన శిబిరం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండిపల్లి సోదరుల జన్మదిన వేడుకలను టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా 100కిలోల కేట్ కట్ చేశారు. అనంతరం 200మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి, ఓబులేసు, ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, పాపయ్య, టీడీపీ ప్రచార కార్యదర్శి జయరాం పాల్గొన్నారు.

ప్రేమాలయంలో అన్నదానం

రామాపురం, మార్చి19(ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లి సోదరుల జన్మదినం సందర్భంగా బుధవారం మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ నేత ఏనుగుల సుధాకర్ ఏర్పాటు చేశారు. అలాగే పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొరివి ధనుంజయ, తిమ్మారెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లెలో రక్తదానం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి



ప్రేమాలయంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

జాతీయ ఐపీ యాత్రలో స్టాల్స్ ఏర్పాటుకు ఆహ్వానం

కురబలకోట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించే జాతీయ ఐపీ యాత్రలో స్టాల్స్ ఏర్పాటుకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్, డీన్ తులసీ రామ్‌నాయుడు పిలుపునిచ్చారు. మేధో సంపత్తి భవిష్యత్‌ను ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడానికి రుసుము అవసరం లేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8712655132, 8712655138నంబర్లను సంప్రదించాలని కోరారు.



స్టాల్స్ కోసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

కాలగర్భం లోకి.. కాలజ్ఞానం!

- నగరిపాడు రంగనాయక ఆలయంలో ప్రతులు
- శిథిలమవుతున్న తాళపత్ర గ్రంథాలు
- ఏడాదికోసారి ప్రదర్శన
- చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతి

మహనీయుడొక్కడు పుట్టేనయా...
మత భేదములు లేకుండ చేసేనయా...
చెడ్డవాని చేతిలో సచ్చేనయా...
సిద్ధ శివ గోవిందా గోవిందా..
హరి గోవిందా గోవిందా...
రమణీ యొక్కటి పుట్టు..
రాజ్యమును పాలించు...
పేదలను ఎక్కించు..
రాజులను దింపించు...
ఆకాశమునందు రక్తమై కనిపించు...
సిద్ధ శివ గోవిందా గోవిందా..
హరిగోవింద.. గోవిందా... అంటూ 17వ శతాబ్దంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞాన ప్రతులు చిట్వేలి మండలం నగరిపాడు గ్రామంలోని శ్రీ రంగనాయస్వామి ఆలయంలో ఉన్నాయి.





అగ్నిగుండంలో లభించిన దండం, కాలజ్ఞానం గ్రంథం, శిథిలమైపోతున్న కాలజ్ఞాన గ్రంథంలోని తాళపత్రాలు

రాజంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రజలనే మేలుకొల్పిన బ్రహ్మంగారి కాలజ్ఞాన ప్రతులకు రక్షణ కరవైంది. ఈ గ్రంథ ప్రతులు కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంతోపాటు సిద్దయ్య మఠం, నంద్యాల జిల్లా బనగానపల్లెలోని గరిమిరెడ్డి అచ్చమ్మ ఆలయంలో, అన్నమయ్య జిల్లా నగరిపాడు రంగనాయక ఆలయంలోను ఉన్నాయి. ఈ ఆలయంలో ఉన్న ప్రతులకు ఎటువంటి రక్షణా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని ఆలయ కమిటీ ఓ పెట్టెలో భద్రపరిచి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రదర్శిస్తోంది.

కుల రహిత సమాజం కోసం..

వీరబ్రహ్మేంద్రస్వాము లవారు రచించిన కాలజ్ఞాన ప్రతులు నగరిపాడు రంగనాయక ఆలయానికి ఎందుకు చేరాయన డానికి స్థానికంగా ఓ కథ ప్రచారం లో ఉంది. 17వ శతాబ్దంలో చిట్వేలి మండలం నగరిపాడుకు చెందిన జగ్గరాజు, జగ్గమ్మ దంపతులకు బ్రహ్మంగారి వరప్రసాదంగా శ్రీ రంగనాయకస్వామి జన్మించారు. చిన్నతనంలోనే రంగరాజు దేశాటన చేస్తూ బ్రహ్మంగారి ఆలయానికి చేరాడు. అక్కడ బ్రహ్మంగారి మనవరాలు ఈశ్వరమ్మ పట్ల ఆకర్షితుడ య్యాడు. అయితే, కులాంతర వివాహాన్ని ఈశ్వరమ్మ తండ్రి గోవిందయ్య, పిన తండ్రి పోతులూరయ్య వ్యతిరేకించారు. తాను బ్రహ్మంగారి వరపుత్రుడినని, తన మనుమరాలైన ఈశ్వరమ్మను పెళ్లి చేసుకోవాలని ఆయన ఆజ్ఞాపించారని, లేదంటే జీవ సమాధి అవుతానని చెప్పారట. అక్కడి పెద్దలు, బ్రహ్మంగారి కు మారులు దీనిపై ఆలోచించి బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞాన ప్రతులను పరిశీలించి అందులో ఈ ప్రస్తావన ఉంటే వివాహం చేస్తామని చెప్పారట. దీంతో బనగానపల్లెకు వెళ్లి గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంటి ముంగిట చింతచెట్టు వద్ద భూమిలో దాచి ఉంచిన కాలజ్ఞాన ప్రతుల్లో మూడింటిని వెలికితీసి వాటితో కందిమల్లాయపల్లెకు వచ్చాడట. ఆ ప్రతులను పరిశీలించగా ఈ జన్మలో శ్రీ రంగరాజుకు, ఈశ్వరమ్మకు పెళ్లి యోగం లేదని, కులాంతర వ్యవస్థ నశించే వరకు ఈ పెళ్లి జరగదని రాసి ఉందట. అంతవరకు శ్రీరంగరాజు, ఈశ్వరమ్మ జీవ సమాధి కావాలని, కుల రహిత సమాజం ఏర్పడిన తర్వాత పునర్జన్మించి వివాహమాడుతారని అందులో ఉందట. ఆ ప్రకారం ఈశ్వరమ్మ బ్రహ్మంగారి జీవ సమాధి పక్కనే సజీవ సమాధి కాగా, రంగరాజు నగరిపాడులోని తన స్వగ్రామంలో అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేశాడని చెబుతుంటారు. అగ్నిగుండం ఆరిపోయిన తర్వాత ఆ బూడిదలో బయటపడిన పాదుకలు, యోగదండం, శిఖాముద్రికలు బయటకు తీసి పూజలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రంగనాయక ఆలయం నిర్మించారు. ఆయన ఆనాడు తీసుకువచ్చిన మూడు ప్రతుల్లో 2 కందిమల్లాయపల్లెలో ఉంచి ఒక ప్రతిని నగిరిపాడులోని రంగనాయకుల ఆలయంలో భద్రపరిచారు. రంగరాజు 1692లో జన్మించగా ఫిబ్రవరి 21, 1717లో జీవ సమాధి అయ్యారు.



నగరిపాడు ఆలయంలోని రంగనాయకస్వామి మూలవిరాట్

కాలజ్ఞాన ప్రతులను ప్రచురించాలి



కాలజ్ఞాన ప్రతులకు తగిన భద్రత లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలజ్ఞాన ప్రతులతో పాటు రంగరాజు పాదుకలు, యోగదండం, శిఖా ముద్రికలకు అధికారులు రక్షణ కల్పించాలి. ఈ కాలజ్ఞాన ప్రతులను ముద్రించాలి.

- పోలిన నాగేశ్వరనాయుడు, ఆలయ కమిటీ చైర్మన్, నగిరిపాడు

కాలజ్ఞాన ప్రతులకే దిక్కులేకపోతే ఎలా ?



భూత భవిష్యత్ వర్తమానాలకు సంబంధించిన కాలజ్ఞాన ప్రతులను ఇంత వరకు అధికారులు కాని, జిల్లా అధికార యంత్రాంగం కాని పరిశీలించలేదు. దీంతో ఈ గ్రంథంలోని తాళపత్రాలు రోజు రోజుకు శిథిలమైపోతున్నాయి.

- పాటూరు సుబ్బరామిరెడ్డి, నగిరిపాడు గ్రామం, చిట్వేలి

పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పూర్తయిన పల్లె పండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఇస్తున్న అదనపు ఆర్థిక సాయం లబ్ధి దారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆయన అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ సిబ్బంది తదితరులతో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు, రీసర్వే, ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్, పల్లె పండుగ కార్యక్రమాలు, ఎన్టీఆర్ హౌసింగ్, పీ4 సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 17 రకాల అంశాలను ఆధారంగా చేసుకొని అనర్హులను తీసివేయాలన్నారు. అర్హులకు మాత్రమే ఇళ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పల్లె పండుగ కింద దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయని ఎంపీడీవోలు అందరూ మంచి పురోగతి సాధించారని అభినందించారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో పూర్తయిన పల్లెపండుగ నిర్మాణాలను ఉగాది రోజున ప్రారంభించాలని సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకొని, ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్‌శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మతో కలిసి మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలి జం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ ఆనర్స్) మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈకోర్సులో ప్రవేశానికి ఇంటర్, సమాన అర్హతగల వారు ప్రవేశానికి అర్హులన్నారు. ఇతర వివ రాలకు హెచ్‌టీటీపీఎస్:// సీఓడీఈ. వైవీయూ.ఈడీయు.ఐఎన్‌ను సంప్రదించాలన్నారు.

రీసర్వే సమర్థవంతంగా పూర్తి చేయాలి

మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



రీసర్వే సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దతిప్పసముద్రం మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియను రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా పూర్తి చేయాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మడుమూరు పంచాయతీ కంసలవాండ్లపల్లె రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేసి రీసర్వే సమస్యలను నేరుగా ఆయా రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ ను మరింత వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టా భూములు, ప్రభుత్వ, అసైన్డ్ భూములన్నింటిపై కూడా సమగ్రం గా సర్వే పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు వివరాలను తన దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ అధికారులకు తెలియచేశారు. భూముల వివరా లు, వెబ్‌ల్యాండ్, డ్రై లాండ్ తదితర వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో రెండు టీములుగా ఏర్పాటు చేసి రీసర్వే ప్రక్రియను రోజుకు 40 ఎకరాలు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీరాములునాయక్ సబ్ కలెక్టర్‌కు వివరించారు. ప్రజల నుంచి వచ్చే పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ దనంజయులు, సర్వేయర్ శ్రీవాణి, ఆర్ఐ బాలాజీ, వీఆర్వో లు, రామకృష్ణ, వెంకటేష్, గ్రామసర్వేయర్లు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

పీలేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పీలేరు, కేవీ పల్లె, కలకడ మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ పీలేరులో ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రాజమ్మ తెలిపారు. 'పోషణ్ బీ-పఢాయి బీ'లో భాగంగా గురువారం నుంచి 22వ తేదీ వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు.

డ్వామా ఏపీడీ బదిలీ

ములకలచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): డ్వామా ఏపీడీ మధుబాబును రాయచోటి క్లస్టర్‌కు బదిలీ చేస్తూ బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ములకలచెరువు ఏపీడీగా లక్కిరెడ్డిపల్లి క్లస్టర్‌లో పనిచేస్తున్న నందకుమార్‌రెడ్డి బదిలీ అయ్యారు.

అనారోగ్యంతో బాధపడుతున్నా సెలవు ఇవ్వండి..

- జడ్పీ సీఈఓకు ఎంపీపీ వినతి

కురబలకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనా రోగ్యంతో బాధపడుతున్నా సెలవు ఇవ్వాలని జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుకు కుర బలకోట ఎంపీపీ దస్తగిరిసాహెబ్ బుధ వారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. అంగళ్లు ఎంపీటీసీగా ఎన్నికైన దస్తగిరి సా హెబ్‌ను ఎంపీపీగా ఏకగ్రీవం చేసుకున్నారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మండల సమావే శాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకోవడంతో పలు మార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మండల సమావేశం నిర్వహణ కోసం వైసీపీ శ్రేణులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలపై టీడీపీ నేతలు, అధికారులతో సమావేశం నిర్వహించి సభను సజావుగా నిర్వహించాలని జడ్పీ సీఈఓ కోరారు. దీంతో గట్టి పోలీసు బందోబస్తు నడుమ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అన్ని వివాదాలు సద్దుమణుగుతుండగా ఎంపీపీ సెలవు కోరుతూ వినతిపత్రం ఇవ్వడం కలకలం రేపుతోంది. మండల సమావేశం జరిగి దాదాపు 50 రోజులు కావస్తోంది. మరో 40 రోజుల్లో మరోసారి సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆయన సెలవు కోరుతూ వినతిపత్రం ఇవ్వడంలో ఆంతర్యమేమిటో అంతుచిక్కడం లేదు. అధికారులు లేదా వైసీపీ నేతల ఒత్తిళ్ల మేరకే ఆయన సెలవు పెట్టారా? అన్న అం శం చర్చనీయాంశమైంది. తనకు 2025 మా ర్చి 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు సెలవు మంజూరు చేయాలని, వైస్ ఎంపీపీ భూదేవికి బాధ్యతలను అప్పగించాలని విన తి పత్రంలో పేర్కొన్నారు. ఆయన వినతి మేరకు సెలవును మంజూరు చేస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

హత్యాయత్నం కేసులో వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అరెస్టు

నీకేదిన్నె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో కమలాపురం వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గోవిందు విజేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లె గ్రామంలో బావి వద్ద చెట్లు కొట్టుకునే విషయమై గజ్జల మల్లికార్జునరెడ్డి, చెన్నూరు నాగమల్లారెడ్డి కుటుంబాల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో నాగమల్లారెడ్డి బంధువైన కమలాపురం మండలం పాచికలపాడు గ్రామానికి చెందిన విజేందర్‌రెడ్డి తన ఐదుగురు అనుచరులతో 2024 జనవరి 29న మల్లి కార్జునరెడ్డిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ కేసులో నాగమల్లారెడ్డి, అతని భార్య రాజమ్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ అండదండలతో విజేందర్‌రెడ్డిని కేసు నుంచి తప్పించారు. అయితే ప్రస్తుతం అతనిపై మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పోలీసు స్టేషన్‌కు వచ్చి విజేందర్‌రెడ్డిని పరామర్శించారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- ఐదుగురు మహిళలకు గాయాలు



పోలీసుల అదుపులో ఉన్న యువకుడు

బద్వేలుటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేసి మహిళలను గాయపరిచిన ఘటన బద్వేలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని ఎగువ బ్రాహ్మణవీధికి చెందిన చరణ్ అనే యువకుడు బుధవారం రాత్రి మద్యం సేవించి ఎగువ బ్రాహ్మణవీధి నుంచి నాగులకట్ట చెరువువైపు ద్విచక్రవాహనం వేగంగా వెళుతుండగా.. అక్కడే ఉన్న మహిళలు నెమ్మదిగా వెళ్లమన్నారు. దీంతో ఆ యువకుడు ఆగ్రహానికిలోనై మహిళలను బూతులు తిడుతూ వారి కాళ్లను చేతులను విచక్షణా రహితంగా కొరికాడు. దీంతో రమణమ్మ, కుమారి, శ్రావణితో పాటు మరో ఇద్దరికి గాయాలు కాగా.. పోలీసులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు యువకుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సచివాలయ ఏఎన్‌యం మృతి

పెండ్లిమర్రి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచునూరు సచివాలయ ఏఎన్ఎంగా పనిచేస్తున్న జ్యోతి (30) గత కొద్ది రోజు లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండేది. ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సచివాలయ, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది నివాళులు అర్పించారు.

హత్య చేసిన భర్త అరెస్ట్ : డీఎస్పీ



మదనపల్లె అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త ఏడాదిన్నర తిరక్కుండానే సంగీత(24)ను హత్య చేసి ఆత్మహత్య అని చిత్రీకరించాడని నిందితుడు కుమార్ లామినిని పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రం, బెలగాం జిల్లా, బాటకూర్తి తండా వాసి సంగీత, అదే తండాకు చెందిన కుమార్ ఇద్దరూ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఈ క్రమంలో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెళ్లికి కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో ఇద్దరూ లేచిపోయి ఏడాదిన్నర కిందట గుర్రంకొండ మండలం మర్రిపాడుకు వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడ ఓ రైస్ మిల్లులో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో కుమార్ మద్యానికి బానిసై తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చి పిల్లలు పుట్టలేదని భార్యను కొట్టి వేధించేవాడు. దీంతో గత నెల 27న రాత్రి సంగీతను కుమార్ పథకం ప్రకారం హత్య చేశాడు. ఆపై ఎవరికీ అనుమానం రాకుండా తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులను నమ్మించాడు. మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు అంబులెన్స్‌లో బెలగాంలోని బాటకుర్తి తండాకు తీసుకెళ్లాడు. అక్కడ సంగీత మృతదేహాన్ని కాల్చి ఏమీ తెలియనట్లు మిన్నకుండి పోయాడు. మర్రిపాడు గ్రామస్తుల సాయంతో హత్య జరిగినట్లు నిర్ధారించిన గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడు, వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు నిందితుడిని అదుపులోకి కేసును లోతుగా దర్యాప్తు చేపట్టి విచారించగా నేరం చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ నిర్మూలన

తంబళ్లపల్లె, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణ అన్నారు. క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం వంటివి క్షయ లక్షణాలన్నారు. ఇటువంటి లక్షణాలున్న వారు ప్రభుత్వాస్పత్రిలో గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగికి ప్రభుత్వం నుంచి ఆరు నెలలు ప్రతి నెలా వెయ్యి రుపాయలు బ్యాంకు ఖాతాకు జమ చేస్తారన్నారు. అంతేకాకుండా, రోగి ఇంట్లో వారికి వ్యాధి సోకకుండా ముందస్తు పరీక్షలు చేసి మందులు ఇస్తామని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ సరిత, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లికి రూ.13.49 లక్షల ఆదాయం

నిమ్మనపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వారపుసంత, బస్టాండు, షాపింగ్ రూముల వేలం ద్వారా నిమ్మనపల్లి పంచాయతీకి రూ.13.49 లక్షలు ఆదాయం చేకూరినట్లు డీఎల్‌పీఓ నాగరాజ తెలిపారు. అధికారుల సమక్షంలో నిర్వహించిన వేలంలో వారపుసంతను హేమంత్‌కుమార్ రూ.7.50 లక్షలకు దక్కించుకోగా, బస్టాండు గేటును రమణయ్య రూ.1.41లక్షలకు దక్కించుకున్నారు. షాపింగ్ రూములను ఏడాదికి రూ.4.58 లక్షలకు పలువురు దక్కించుకున్నారు. ఈఓపీఆర్‌డీ చలపతిరావు మాట్లాడుతూ వేలం పాడుకున్న వ్యక్తులు వారంలోగా పంచాయతీకి పూర్తి మొత్తాన్ని చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రమేష్, కార్యదర్శులు వెంకటరమణ, రాజేష్ పాల్గొన్నారు.

పట్టపగలు ఏటీఎంలో చోరీకి యత్నం... ఇద్దరు అరెస్టు



ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగలతో సీఐ, పోలీసులు

ఎర్రగుంట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులోని ఐసీఐసీఐ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో పట్టపగలు చోరీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం సాయంత్రం సీఐ నరేష్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజుపాలెం మండలంలోని తొండలదిన్నెకు చెందిన కొత్తమాసి సుధీకర్ 2020 నుంచి సెక్యూర్ వ్యాల్యూ కంపెనీలో ఏటీఎంలలో డబ్బులు లోడ్ చేసే ఉద్యోగం చేసేవాడు. చెడు వెసనాలకులోనైన సుధీకర్ అప్పుడప్పుడు నగదును చోరీ చేస్తూ సుమారు రూ.36లక్షల వరకు చోరీ చేశాడు. దొంగిలించిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ వారు దొంగిలించిన డబ్బులను రికవరీ చేసి.. అతనిని విధుల నుంచి తొలగించారు. దీంతో అప్పులు కావడంతోపాటు తిరిగి అప్పులు పుట్టకపోవడంతో ఎలాగైనా డబ్బులు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులో మూసివేసిన ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎంలో చోరీ చేసేందుకు నిర్ణయించుకున్నాడు. గతంలో ఏటీఎంలో డబ్బులు పెట్టేవాడు కాబట్టి ఎవరికి అనుమానం రాదనుకున్నాడు. తనకు స్నేహితుడు, వెల్డింగ్ పనిచేసే తొండలదిన్నెకు చెందిన గాలిపోతుల అభిషేకంతో తన పథకం చెప్పాడు. ఇద్దరూ కలిసి నంద్యాలకు వెళ్లి గ్యాస్ సిలిండర్, కట్టర్‌ను కారులో తీసుకువచ్చి 17వ తేదీ మధ్యాహ్నం 1.50గంటలకు మూసివున్న ఏటీఎం షెట్టర్ తీసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేశాడు. అయితే డబ్బు ఉన్న బాక్స్ ఎంత ప్రయత్నించినా తెరచుకోలేదు. అప్పటికే చాలా సేపు కావడంతో ఎవరైనా వస్తారేమోనని భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈవిషయం తెలుసుకున్న ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఎర్రగుంట్ల వై.జంక్షన్ వద్ద ఇద్దరిని అరెస్టు చేసి.. కారు, ఆక్సిజన్ సిలిండర్, గ్యాస్ కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు గురుశంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోర్టులో గంగమ్మకు క్షీరాభిషేకం



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో గంగమ్మకు బుధవారం ఆలయకమిటీ సభ్యులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే 108 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు, మహిళలు స్వయంగా అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విశేషాలంకరణతో పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు పర్యవేక్షించారు.

వడదెబ్బ ప్రాణాంతకం... జాగ్రత్త



బోయపల్లెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ ప్రభావం ప్రాణాంతకంగా మారుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి సనాఆయేషా పేర్కొన్నారు. బుధవారం పీహెచ్‌సీ పరిధి బోయపల్లెలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. తీవ్రమైన తలనొప్పి, జ్వరం, మానసిక ఒత్తిడి పెరగడం, నీరసం, కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు, శ్వాస తీసుకోవడం కష్టం, శరీరంపై ఎర్రని పొక్కులు రావడం, అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలన్నారు. ఎండ తీవ్రత ఉన్న పగలు అత్యవసరమైతే తప్ప బయట తిరగరాదని రోజుకు కనీసం 15 గ్లాసులు మంచి నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఆదరణ-3 ఆధునిక పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ హరినారాయణ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదరణ-3 పథకంపై కార్యదర్శులు, బీసీ సంఘ నేతలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ చేతి వృత్తుల వారు కావాల్సిన పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుట్టుమిషన్లు కావాల్సిన వారు సంబంధిత సచివాలయాలకు వెళ్లి దరఖాస్తులు సమర్పించాలన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు భజంత్రి రామాంజులు, పార్లమెంటు మహిళా కార్యదర్శి గంగాదేవి, మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, నేతలు పాల్గొన్నారు.

'ఆదరణ-3'ను సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె టౌన్/గుర్రంకొండ/తంబళ్లపల్లె, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేయనున్న ఆదరణ-3 పథకాన్ని కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో కులవృత్తుల సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. మండలంలో లబ్ధిదారుల వివరాలు, కావాల్సిన పనిముట్లు తెలపాలని కోరారు. కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

గుర్రంకొండ మండల బీసీ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్ రహీం తెలిపారు. తంబళ్లపల్లె మండలంలోని కులవృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి సూచించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, కులవృత్తిదారులకు అవగాహన నిర్వహించారు.

ఆధునిక పరికరాల కోసం సలహాలు

నిమ్మనపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, కుల, చేతివృత్తుల కోసం ప్రభుత్వం అందించే ఆధునిక పరికరాల కోసం సలహాలు సూచనలు అందించాలని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి కోరారు. బీసీలను దృష్టిలో పెట్టుకుని వారి జీవన శైలిలో మార్పులు తీసుకు వచ్చేందుకు పలు మార్పులు చేసిందన్నారు. కుల వృత్తులు చేసే వారికి ఎలాంటి పరికరాలు కావాలి, ప్రభుత్వం అందించే పరికరాల్లో మార్పులపై అడిగారు.

రైతులకు సబ్సిడీ ధరలకు అందించడమే లక్ష్యం

జిల్లా కో-ఆర్డినేటర్ రమణ



రైతు సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సభ్యులకు సబ్సిడీ ధరలకు అందించడమే రైతు ఉత్పత్తి దారుల సంఘం ఉద్దేశమని అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ రమణ పేర్కొన్నారు. బూర్లపల్లెలో నాబార్డు, నాఫెడ్ అధ్వర్యంలో టెరి సంస్థ ప్రోత్సాహంతో రైతు ఉత్పత్తి దారుల సంఘ కార్యాలయాన్ని నేతలు, సంస్థ ప్రతినిధులచే ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నాబార్డు, నాఫెడ్ అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తోందని, దీని ద్వారా ఒక్కో సంఘంలో పదిమంది రైతులు డైరెక్టర్లుగా ఉంటూ మిగిలిన వారు సంఘ సభ్యులుగా ఉంటారన్నారు. సభ్యులు ఒక్కొక్కరు రూ. వెయ్యి చెల్లించి సంఘంలో నమోదు చేసుకోవాలన్నారు. ఏర్పడిన మూలధనానికి కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసి సంఘం ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. జిల్లాలో పీటీఎం, మొలకలచెరువు, గాలివీడు, పెద్దమండ్యం మండలాల్లో ఇలాంటి సంఘాలను ఐదు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో రామసముద్రం మొదటిదన్నారు. త్వరలోనే ఎరువులు, మందులు తదితర సేవలను అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, పోతుపేట సర్పంచ్ కొండా కళావతి, చిన్నపరెడ్డి, తిమ్మిరెడ్డిపల్లె శంకర, సంపతికోట సర్పంచ్ చిన్నరెడ్డెప్ప, వ్యవసాయ సచివాలయ ఉద్యోగి పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

ములకలచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొనడంతో రామమూర్తి తీవ్రంగా గాయపడ్డాడు కదిరినాథునికోట పంచాయతీ కాసుపల్లె వాసి రామమూర్తి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వెళుతుండగా సబ్‌స్టేషన్ వద్ద మరో ద్విచక్రవాహనం ఢీకొంది. క్షతగాత్రున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరం గా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆయుర్వేద కౌన్సిల్ ఏర్పాటుకు అసెంబ్లీలో బిల్లు

మదనపల్లె అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రభుత్వ అధికారుల సంప్రదింపుల ఫలితంగా ప్రభుత్వం అసెంబ్లీలో ఆయుర్వేద కౌన్సిల్ బిల్లు ప్రవేశ పెట్టడం హర్షదాయకమని చిత్తూరు జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ దివ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం అసెంబ్లీలో కౌన్సిల్ బిల్లు పెట్టడం ఆయుర్వేద వైద్యుల చిరకాల స్వప్నమన్నారు. ఈ బిల్లు ప్రవేశ పెట్టడానికి ఏకగ్రీవంగా ఆమోదించిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆరోగ్యమంత్రి సత్యకుమార్, అసోసియేషన్ చైర్మన్ వేముల ఇష్, ప్రెసిడెంట్ డాక్టర్ బి. రాజేశ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సీహెచ్ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా ఈ బిల్లు గవర్నర్ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధిలో బదిలీలు

పెద్దమండ్యం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ఏపీఓ, టీఏ బదిలీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు వెల్లడించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పెద్దమండ్యం ఏపీఓ మురళీమోహన్ చిన్నమండ్యానికి, టెక్నికల్ అసిస్టెంట్‌లు సోమశేఖర కురబలకోటకు, భూదేవి తంబళ్లపల్లికి బదిలీ కాగా కంప్యూటర్ అపరేటర్ శైలజ కలకడకు బదిలీ అయ్యారని తెలిపారు. రామసముద్రం ఏపీఓ, గుర్రంకొండ మండలంలోని ఇద్దరు టీఏలు పెద్దమండ్యంకు బదిలీపై రానున్నట్లు సమాచారం.

గ్రామ పంచాయతీ కార్యాలయం, పీలేరు, తేది.19-03-2025

వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **2025-26 సం॥నకు** అనగా (ఏప్రిల్ 1, 2025 నుండి మార్చి 31, 2026 వరకు) పీలేరు గ్రామ పంచాయతీకి చెందిన 1) వారపు సంత, 2) దినసరి కూరగాయల మార్కెట్లు, 3) ప్రైవేటు బస్టాండు, 4) జంతు వధశాలకు రుసుము వసూలు చేసుకొనుటకు హక్కుల బహిరంగ వేలము తేది.27-03-2025న గురువారం అనగా ఉ.11-00 గంటలకు పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు శ్రీ డివిజనల్ పంచాయతీ అధికారి, మదనపల్లి మరియు విస్తరణ అధికారి (పం.రా. & గ్రా.అ.) పీలేరు మండలం వారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వారిచే నిర్వహించబడును. వేలము నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింది తెలిపిన విధంగా ధరావత్తు చెల్లించి వేలము నందు పాల్గొనవచ్చును.

వరుస సంఖ్య	వసరుల వివరములు	చెల్లించవలసిన డిపాజిట్లు	సాల్వెన్సీ ధృవపత్రము	సాల్వెన్సీ లేనివారు చెల్లించవలసిన ధరావత్తు
1.	2	3	4	5
1	వారపు సంత	5,00,000-00	5,00,000-00	10,00,000-00
2	దినసరి మార్కెటు (మంగళవారం మినహాయించి)	1,00,000-00	1,00,000-00	2,00,000-00
3	ప్రైవేటు బస్టాండు	1,00,000-00	1,00,000-00	2,00,000-00
4	జంతు వధశాల, మాంసపు అంగళ్ళు	50,000-00	50,000-00	1,00,000-00

వేలపు షరతులు :

1. డిపాజిట్లు మొత్తమును డి.డి. రూపంలో మాత్రమే స్వీకరించబడును.
2. వేలము నందు పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బాకీలు ఉండరాదు.
3. వేలములో పాల్గొనువారు మైనరుగా ఉండరాదు.
4. పాట పూర్తయిన వెంటనే సగభాగము చెల్లించవలెను. అట్లు తప్పిన యెడల పాట ధరావత్తును దండగ క్రింద జమచేసి రెండవ హెచ్చు వేలము పాటదారునికి ఖాయపరచబడును.
5. మిగిలిన మొత్తమును 24 గం॥లలోపు అనగా 28-03-2025న అనగా శుక్రవారం మధ్యాహ్నం 2-00 గం॥ల లోపల చెల్లించవలెను. అట్లు తప్పిన యెడల రెండవ హెచ్చు వేలము పాటదారునికి ఖాయపరచబడును. రెండవ హెచ్చు వేలము పాటదారుడు తాను పాడిన వేలము పాట మొత్తానికి సుముఖత చూపనియెడల, అతని ధరావత్తు కూడా దండగ క్రింద జమచేయబడును.
6. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వేలం పాట మొత్తమునకు అదనంగా 3% స్టాంపు డ్యూటీ చెల్లించి, అగ్రిమెంటు చేసి, సుంకము వసూలు చేయువారి పేర్లను మరియు వ్రాతపూర్వకమైన అనుమతి పొంది, అగ్రిమెంటు చేసిన పిదపనే ఫీజులు వసూలు చేసుకొను హక్కులు సంక్రమించును.
7. వేలముదారుడు పాడిన పాట అప్ సెట్ ప్రైజుకు పైబడియుండవలెను. అట్లు తక్కువ వున్న యెడల వేలము రద్దు పరుచుటకు వాయిదా వేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.
8. ఎటువంటి కారణము తెలుపకనే సదరు వేలము రద్దు పరుచుటకు వాయిదా వేయుటకు గ్రామ పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

గమనిక : డిపాజిట్లును పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ పీలేరు వారి పేరున డిడి మాత్రమే స్వీకరించబడును. నగదు స్వీకరించబడదు.

వై. గురుమోహన్, B.Tech., LL.B.
పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1)
గ్రామ పంచాయతీ, పీలేరు
సెల్ : 99660 44566

డా. షేక్ హబీబ్ భాషా
సర్పంచ్
గ్రామ పంచాయతీ, పీలేరు
సెల్ 98857 42148

గ్రామ పంచాయతీ కార్యాలయం, పీలేరు, తేది.19-03-2025

వేలము ప్రకటన

పీలేరు గ్రామ పంచాయతీకి సంబంధించిన షాపింగ్ గదులు **తేది.01-04-2025 నుండి 31-03-2026 వరకు** అనగా 1 సంవత్సర కాలమునకు నెలసరి బాడుగ పద్ధతిపై గుత్త హక్కును కేటాయించుటకు తేది.27-03-2025న అనగా గురువారం సా.03.00 గంటలకు పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి గాని లేక వారి అనుమతి ఉత్తర్వులు పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. నెం.	ప్రదేశము	గది నెం.	గది కేటాయింపు కేటగిరి	డిపాజిట్లు డి.డి. రూపమున మాత్రమే	హాజరు పరచవలసిన సాల్వెన్సీ ధృవపత్రము	కాలపరిమితి
1	వారపు సంత రోడ్డు	1	జనరల్	30000/-	100000/-	01-04-2025 నుండి 31-03-2026
		2	జనరల్	30000/-	100000/-	‖
		3	జనరల్	30000/-	100000/-	‖
		4	జనరల్	30000/-	100000/-	‖
		5	జనరల్	30000/-	100000/-	‖
		6	నాయి బ్రాహ్మణ	30000/-	100000/-	‖
		7	జనరల్	300000/-	300000/-	‖
		8	జనరల్	300000/-	300000/-	‖
		9	జనరల్	75000/-	100000/-	‖
		10	నాయీ బ్రాహ్మణ	75000/-	100000/-	‖
		11	యస్.సి./యస్.టి	50000/-	100000/-	‖
		12	జనరల్	50000/-	100000/-	‖
		13	జనరల్	50000/-	100000/-	‖
		14	జనరల్	50000/-	100000/-	‖
2	గ్రామ పంచాయతీ కార్యాలయము ముందర	15	నాయి బ్రాహ్మణ	75000/-	100000/	‖
3	గ్రామ పంచాయతీ కార్యాలయము ముందర	16	యస్.సి./యస్.టి	50000/-	100000/-	‖
4	దినసరి కూరగాయల మార్కెట్	17	జనరల్	15000/-	50000/-	‖
		18	జనరల్	15000/-	50000/-	‖
		19	జనరల్	15000/-	50000/-	‖
5	వారపు సంత రోడ్డు	20	జనరల్	10000/-	50000/-	‖
		21	జనరల్	25000/-	100000/-	‖
		22	జనరల్	25000/-	100000/-	‖
		23	జనరల్	25000/-	100000/-	‖
		24	జనరల్	25000/-	100000/-	‖
		25	జనరల్	15000/-	50000/-	‖
		26	జనరల్	15000/-	50000/-	‖
		27	యస్.సి./యస్.టి	15000/-	50000/-	‖
6	గ్రామ పంచాయతీ కార్యాలయము ముందర	28	జనరల్	10000/-	50000/-	‖
7	దినసరి కూరగాయల మార్కెట్	29	పి.హెచ్.సి.	10000/-	50000/-	‖
8	వారపు సంత రోడ్డు	30	బి.సి.	10000/-	50000/-	‖

షరతులు :

1. వేలములో పాల్గొనువారు పంచాయతీకి పన్నులు, లీజు / బాడుగ మొత్తములు బకాయిలు ఉండరాదు.
2. బహిరంగ వేలము అయిన వెంటనే మొదటి మరియు రెండవ పాటదారుల డిపాజిట్లను మినహాయించుకొని తక్కిన డిపాజిట్లు వాపసు చేయబడును.
3. షె.కు./షె.తె./వె.త తరగతుల వారు కుల ధృవీకరణ పత్రములతో హాజరు కావలెను.
4. వేలమును నెలసరి బాడుగ మాత్రమే పాట పాడవలెను.
5. ప్రభుత్వ నిషేధిత వ్యాపారములు సదరు రూపములో నిర్వహించుట నిషేధించబడినది.
6. ప్రతి నెల బాడుగను జి.యస్.టి.తో కలిపి చెల్లించవలెను.
7. ప్రతి నెల 10వ తేదీ లోపల నెల బాడుగ చెల్లించని యెడల 18% చక్రవడ్డీతో కలిపి వసూలు చేయబడును.
8. ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.
9. వేలము రద్దు పరుచుటకు మరొక తేదీకి వాయిదా వేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు.

వై. గురుమోహన్, B.Tech., LL.B.
పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1)
గ్రామ పంచాయతీ, పీలేరు
సెల్ : 99660 44566

డా. షేక్ హబీబ్ భాషా
సర్పంచ్
గ్రామ పంచాయతీ, పీలేరు
సెల్ 98857 42148

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేతలు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మదనపల్లె టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విజయవాడ సచివాలయంలోని మంత్రి చాంబర్‌కు వెళ్లిన టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె టీడీపీ నేతలు దేవరింటి శ్రీనివాసులు, వై.దొరస్వామినాయుడు, మేకలరెడ్డిశేఖర్, కొండ్రెడ్డి తదితరులున్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో బుధవా రం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జిల్లా మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

పాడి రైతులకు సబ్సిడీ ధరలకు పశుగ్రాస విత్తనాలు

వాల్మీకిపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ధరలకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తోందని నగిరిమడుగు పశువైద్యా ధికారి చరిత పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా పశుగ్రాసం కొరత అధిగమించేందు కు 75శాతం రాయితీతో మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నారన్నారు. ఐదుకిలోల బ్యాగ్ ధర రూ.85, ఒక్కో రైతుకు గరిష్ఠంగా 20కిలోల వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం జర్రావారిపల్లె, సాకి రేవుపల్లెల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్పంచ్ మునిభాస్కర్, పశు సంవర్ధక సహాయకుడు రెడ్డివరప్రసాద్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్‌కు భూములు ఇవ్వండి

- న్యాయమైన పరిహారం ఇప్పిస్తాం

మదనపల్లె టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎంఐజీ(మిడిల్ ఇన్‌కం గ్రూపు) లేఅవుట్‌కు రైతులు భూములు ఇవ్వాలని, వారికి న్యాయమైన పరిహారం ఇప్పిస్తామని తహసీల్దార్ ధనంజయులు పిలుపునిచ్చారు. బుధవారం పోతబోలు గ్రామం వద్ద రైతులతో చర్చించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఎంఐజీ లేఅవుట్‌కు 28 ఎకరాల భూమి అవసరమవుతుందని, దీని కోసం 13 మంది రైతుల భూములను సేకరణకు గుర్తించామన్నారు. ప్రభుత్వానికి భూములు ఇచ్చే రైతులు పరిహారం ఎంత ఆశిస్తున్నారో అభిప్రాయాలను తెలపాలని కోరారు. దీనిపై రైతులు మాట్లాడుతూ తామంతా చర్చించుకుని సబ్‌కలెక్టర్ వద్ద తమ అభిప్రాయాలు తెలుపుతామని తహసీల్దార్‌కు చెప్పారు.

ఘనంగా జనసేన నేత జన్మదిన వేడుకలు



బండి మనోహర్‌కు కేక్ తినిపిస్తున్న రాందాస్‌చౌదరి

మదనపల్లె అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జనసేన నేత బండి మనోహర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలో బండి మనోహర్ ఇంట్లో నిర్వహించిన వేడుకలో జనసేన రాయలసీ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి జనసైనికులతో కలిసి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి బండి మనోహర్‌కు తినిపించి శుభాకాంక్షలు అందజేశారు. రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, జిల్లా సెక్రటరీ గజ్జల రెడ్డెప్ప, జాయింట్ సెక్రటరీ సనావుల్లా, పట్టణ ప్రధాన కార్యదర్శి వరికోల నాగరాజు, పురం నగేష్, పట్టణ ఉపాధ్యక్షుడు మేకల చెరువు అర్జున, కార్యదర్శి రెడ్డిశేఖర్ రెడ్డి, పటణ కార్యదర్శి నాగవేణి, ఎం. రామ్మోహన్, రూరల్ కార్యదర్శి పద్దు, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్య వేదిక అధికార ప్రతినిధిగా పోలిశెట్టి సురేంద్ర



పీలేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ప్రతినిధిగా పీలేరు టీడీపీ నేత పోలిశెట్టి సురేంద్ర నియమితులయ్యారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సుంకర చిన్న రెడ్డిబాబు బుధవారం పోలిశెట్టి సురేంద్ర నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ చేనేత రంగ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేశ్‌తో కలిసి కృషి చేస్తానన్నారు. చేనేతలపై ప్రత్యేకమైన అభిమానం కలిగిన నారా లోకేశ్ మంగళగిరిలో టాటా ట్రస్టు ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అక్కడ విజయవంతమైన పథకాలను రాష్ట్రమంతటా అమలు చేసేలా ఆయనతో మాట్లాడి చేనేతల జీవితాల్లో కొత్త వెలుగులు నిండేలా చూస్తామన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన పోలిశెట్టి సురేంద్రను పలువురు నేతలు, ఉద్యోగులు అభినందించారు.

కోటకాడపల్లి ఉపాధి టీఏ, ఎఫ్ఏ సస్పెన్షన్

పెద్దమండ్యం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోటకాడపల్లి ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తం, ఫీల్డ్ అసిస్టెంట్ సుశీ లను సస్పెండ్ చేశారని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు వెల్లడించారు. కోటకాడపల్లి టీఏ,ఎఫ్ఏలను సస్పెండ్ చేసినట్లు జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం నుంచి ఆదేశాలు వచ్చాయని ఎంపీడీఓ తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలపై ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

వేలంలో రెట్టింపు ఆదాయం

మదనపల్లె టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సీటీఎం-1 పంచాయతీకి వారపుసంత వేలంతో గతేడాదికన్నా రెట్టింపు ఆదాయం వచ్చింది. బుధవారం డీఎల్‌పీఓ నాగరాజు, సర్పంచ్ ఆనంద్ పార్థసారథి ఆధ్వర్యంలో వారపుసంత గేట్లు వసూలు హక్కుల వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఐదుగురు పాల్గొనగా వారిలో మహమ్మద్ రూ.5.76లక్షలకు హక్కు పొందారు. గతేడాది కేవలం రూ.2.05 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చిందని ఈఓఆర్డీ అబ్దుల్‌షకూర్, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ తెలిపారు.

ఘనంగా దండుమారెమ్మ జాతర



కురబలకోట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. రెండు రోజులు నిర్వహించనున్న జాతరల్లో భాగంగా రాత్రి జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని అలంకరించి ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్ళపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్‌లు జయచంద్రారెడ్డి, సుగవాసి సుబ్రమణ్యం, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మల్లికార్జున నాయుడు, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ అన్నదానం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, చాందినీ బండ్లను ఊరేగించారు. ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జాతీయ ఐపీ యాత్రలో స్టాల్ ఏర్పాటుకు ఆహ్వానం



స్టాల్స్‌ను ఆహ్వానిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 21,22న రెండు రోజులు నిర్వహించే జాతీయ ఐపీ యాత్రలో స్టాల్స్ ఏర్పాటుకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్, డీన్ తులసీరామ్ నాయుడు పిలుపునిచ్చారు. మేధో సంపత్తి భవిష్యత్‌ను ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలను రక్షించడం, సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు, సార్టప్‌ను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమన్నారు. వర్క్‌షాప్‌లో భౌగోళిక సూచికలు, ట్రేడ్ మార్క్‌లు, కాపీరైట్స్, పేటెంట్ సహా మేధో సంపత్తి హక్కుల కీలక అంశాలను నిపుణులు తెలియజేస్తారన్నారు. తమలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి మంచి అవకాశమని, పాల్గొని తమలోని నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. పరిశోధకులు, విద్యావేత్తలు, వ్యవస్థాపకులు చట్టపర సలహాదారులు, ఇంక్యుబేషన్ మేనేజర్‌కు ప్రయోజనం చేకూర్చేలా వర్క్‌షాప్‌ను నిర్వహిస్తారన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడానికి రుసుము అవసరం లేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 8712655132, 8712655138 సంప్రదించాలని కోరారు.

పంచాయతీ కార్మికులకు ఇఫ్తార్ విందు

పీలేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పనిచేస్తూ రమజాన్ ఉపవాసాలు ఉంటున్న కార్మికులకు బుధవారం ఈఓ గురుమోహన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర రమజాన్ మాసంలో విధిగా ఉపవాసాలు ఉంటూ కూడా తమ కార్యాలయంలోని చాలా మంది కార్మికులు విధులకు హాజరవుతున్నారని, సంఘీభావం తెలిపేందుకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యాలయంలో తొలిసారి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈఓపీఆర్ఆర్డీ లతీఫ్ ఖాన్, కార్యదర్శులు జ్ఞానశేఖర్, సంయుక్త, శివాజీ, శానిటరీ అధికారి నౌషాద్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డి వరప్రసాద్, సిబ్బంది మున్నా, మస్తాన్, ముబారక్, మెహతాజ్, సుబ్బు, దాదాపీర్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible] M/s శ్రీరామ్ ఫైనాన్సు లిమిటెడ్, పీలేరు [illegible]

SCHEDULE

Annamayya district, erstwhile chittoor district, piler sub district, piler mandal, piler gram panchayat & village accounts, ward no.1, kotapalli residential area, sy.no.402, **plot bearing no.7** an extent of 98 sq. yards of site, and in it constructed rcc building bearing old door no.309/18 with assessment no.836, new door no.1-634 with assessment no.574 **bounded on:- East**: site in plot no.8; **West**: house of raja reddy; **North**: 16 ft. width road; **South**: site sold by c.krishna reddy; within these site ad measuring east to west 24 ft. or 7.320 mts., and north to south 36 ft. or 10.980 mts., comprising a total extent of 98 sq. yards of site and in it constructed rcc building along with all fixtures and appurtenants site therein.

యం. భవాని శంకర
న్యాయవాది, పీలేరు-517214

బహిరంగ ప్రకటన

[illegible] M/s శ్రీరామ్ ఫైనాన్సు [illegible]

SCHEDULE

Item No.1:-
Tirupati District, Chinnagottigallu Sub District, Yerravaripalem Mandal, Udayamanikyam Gram Panchayat, No.87 Udayamanikyam Village Accounts, Dry Sy.No.458, an extent of Ac.3.42 cents and as per ROR 1B present Sy.No.458/1C, an extent of Ac.0.42¾ cents or 0.172 hectors of **Land bounded on:- East** : Land of Arawpalli Chittibabu Naidu; **West**: Land of Indala Subramanyam; **North**: Land of Desireddy Doraswamy Naidu; **South** : Banda; Within these an extent of Ac.0.42 3⁄4 cents or 0.172 hectors of land only.

Item No.2:-
Tirupati District, Chinnagottigallu Sub District, Yerravaripalem Mandal, Udayamanikyam Gram Panchayat, No.87 Udayamanikyam Village Accounts, Dry Sy.No.188, a total extent of Ac.6.85 cents and as per ROR 1B present Sy.No.188/1C, an extent of Ac.0.62 1/2 cents or 0.405 hectors of **Land bounded on:- East**: Land of applicant D.Sheshadri; **West**: Land of executants D.Rama Naidu; **North**: Land of Garlapati Saradhi Naidu; **South**:Banda; Within these an extent of Ac.0.62 1/2 cents or 0.405 hectors of land only. Both items comprising a total extent of Ac.1.05 1/4 cents of land only.

యం. భవాని శంకర
న్యాయవాది,పీలేరు-517214